స్కెచ్

# పదిగంటలు

'రాజా'

ప్రపంచం జోక్యంలేకుండా బ్రతికే మూర్తికే యిలాంటి ఘోరప్రమాదం సంభవించిందంటే ఏమనుకోవాలి? అతను ఏమంత పేరుపడ్డవ్యక్తి కాదు. ఎవళ్లతోటీ దెబ్బలాటలూ అవీ పెట్టుకునే రకమూకాదు. ఎప్పుడూ తనసంగతేదో తనుచూసుకునే రకం మనిషి.

సంఘానికి ప్రపంచంలో మూర్తి అనేమనిషి ఉన్నాడనే సంగతి తెలుసో తెలియదో కూడా. కాని నాకుమాత్రం అతనంటే ఏదో ఒకవిధమైన అకర్షణ ఉండేది. ఎందుకో నాకేతెలియదు. అతనుకూడా అందరితోటీ ముభావంగా ఉన్నాకూడా నాతో మనసిచ్చి మాట్లాడేవాడు.

మూర్తిది సన్నగాపొడుగ్గా ఉండేవిగ్రహం మే మిద్దరం ఒకే ఆపీసులోపని చేస్తుండేవాళ్ళం అతని కళ్ళలో ఒకవిధమైన పట్టుదలని చూస్తూ ఉండే వాణ్ణి.

పదేళ్ళక్రితం సంగతి—అప్పుడతనికి యిరవై యేళ్లుండేవి. అతను అందరిలాగానే బియ్యేప్యాసయ్యాడు, నాలాగే ఆపీసులో గుమాస్తాపనికి కుదిరాడు. అప్పుడప్పుడు అంటూండేవాడు "ఏమిటో ఈచదువులు! ఒట్టికబ్బురుదండుగతప్ప మరేమీ కనిపించదు" అని. మేమిద్దరం ఒకేబస్సులో ఆఫీసుకెళ్ళేటప్పుడు తటస్థపడుతూ వుండేవాళ్ళం, అతని వైఖరిని బట్టి అతను ఎవరి దగ్గిరా రహస్యాలు దాచేమనిషి కాడని తేలింది. బహుశా అతనికి రహస్యాలనేవేలేవేమో!

మూర్తికి సంగీతం, నాట్యం అంటే చాలయిష్టం. అనేక విషయాల్లో నాయిష్టాలూ, అతని ఇష్టాలూకూడా ఏకీభవించేవి. కాని అదేం యింద్రజాలమో, ఒక అమ్మాయి అతని జీవితంలో ప్రవేశించడంతో అతనిజీవిత పంథా మారిపోయింది.

ఆమె అంత అందగత్తె అనిచెప్పడానికి వీల్లేదు. కాని మూర్తిమాత్రం ఆమె ప్రపంచంలోకల్లా అందగత్తెఅని పొగడేవాడు. "ఈమెని ఒకసారి ప్రేమించామంటే ఇంక ఆ ప్రేమ చిరస్థాయిగా ఉండి పోతుంది" అన్నాడొకసారి. ఏమో, నాకేంతెలుస్తుదదంతా? కాబోలుననుకున్నాను

ఆమె చాలా చలాకిగావుండేది. ఎప్పుడూ సంతోషంగా ఆడుతూ పాడుతూ వుండేది ఆమె నల్లటి కళ్లు చూస్తే అందులో ఎన్నెన్నోవిషయాలు దాగి ఉన్నట్లుండేది. ఆమె మనస్సులో ఉండే భావాలు మూర్తితప్ప ఇంకెవరూ చూడలేరని అనుకుంటూ ఉండేవాణ్ణి.

ఆమె మూర్తిని కలుసుకునేముందు తన జీవితానికి సరిహద్దు లేర్పరచుకుంది. చదువుకున్నందువల్ల వచ్చిన సంస్కారం "ఎవరిదారి వాళ్లుచూచు వలసిందే ఎవరిమీదా ఆధారపడకు. ఈ స్వార్థంతో కూడుకున్న లోకాన్నినమ్మకు." అని హెచ్చరించింది, ఆమె ఈ విషయాల ప్రకారం ఎంతవరకూ నడుచు కుందో చెప్పలేము.

ఆమె ఎంతోమందిని మిత్రులుగాచేసుకుంది. చేసుకోడమేగాదు మిత్రులుగానిలుపుకుంది. ఆమెకి అంతరంగంలో అందర్నీ అర్థంచేసుకొనే శక్తివుందని నేననుకునేవాణ్ణి. ఆమె అందరితోటీ వాదనలుచేసి వాళ్ళ సమస్యల్ని అర్థంచేసుకో యత్నించేది. అయితే, ఆమెకీ మూర్తికీ ఉన్నసంబంధం వీటన్నిటినీ అతిక్రమించింది.

ఆమె మూర్తిజీవితంలో ప్రవేశించిగ తనహృదయాన్ని అతనికిచ్చి, అతనిహృదయాన్ని తాను తీసుకుంది ఆమె అతని దగ్గిరనించి తానింతకు మున్నెన్నడూ వినని విషయాలు తెలుసుకుంది. దానికి బదులుగా తనప్రేమనాతని కర్పణచేసింది.

ఆపీసుకి బస్సులో పోయేటప్పుడు నేనతని కెదురుగాకూర్చుని ఆతని కళ్ళవేపే చూస్తూ ఉండే వాణ్ణి. ఆకళ్ళల్లో అతని చరిత్రంతా కనిపించేది. సాయంకాలపు షికార్లూ, నవ్వులూ అన్నీకలిసిన ఒక ఉత్కృష్టమైన ఆనందంతో అతని కళ్లుమెరిసేవి. ఇంతలో ఆమెరుపు మాయమై ఆకళ్లు భావిని గూర్చి ఆలోచనలు సాగించేవి.

'ప్రేమ' 'పెళ్లి' సర్వసాధారణమైన రోజుల్లో మూర్తిప్రేమించి, ఆ అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడనడం ఎవరికీ వింతగా కనిపించలేదు. మూర్తికి కావలసిందిఅదే! అతనికి ఆమెతో సంఘదూరంగా స్వప్నాలతోలతలు అల్లడమే కావాలి. కాని అతని స్వప్నాలు సామాన్యుడికి అందవని తెలుసు కాని సామాన్యుడే ఉన్నతస్థానం పొందాక క్రిందికిచూసి, స్వప్నసీమల్లో విహరించేకవుల్నీ, గాయకుల్నీ, గాలి మేడలుకట్టే మనుష్యుల్నీ చూసి నిర్దాక్షిణ్యంగా నవ్వుతాడు

అతననేవాడు, "ఏమిటో ఈ ప్రపంచం! నాగరికులమని చెప్పుకుంటూ ఈ కవులు వాస్తవికత నేమర్చిపోయి ఇంకా ప్రకృతి శోభలకోసం పాటు పడతారెందుకో? నేను సామాన్యులని అసహ్యించుకోను, కాని దూరంసించే వాళ్ళని చూస్తాను, పైశాఖ కెక్కిపోయాక క్రింద ఉండిపోయిన వాళ్ళనిచూసి ఆక్షేపించడం నాతత్వంగాదు"

* * *

ఆదినం మామూలుగా బస్సు ఎక్కడంకోసం 'బస్‌స్టాప్' దగ్గిరనిలుచున్నాం. ఇంతలో "ఆమె" రెండోప్రక్క పేవ్‌మెంటు మీద నిలబడివుంది ఈ సంగతి మూర్తికి చెబుదామనుకునేలోగానే మూర్తి అదిక్కుకి చూశాడు. వాళ్ళచూపులు కలిసాయి. వాళ్ళచూపులు చాలాకాలంగా వియోగం పొంది తిరిగి కలుసుకున్నట్లుగా ఉన్నాయి; ఆమె అటూఇటూ చూసుకోకుండా రోడ్డుని అటునించి ఇటుకి దాటింది. అంతే ఒకకారు ఆమెని గ్రుద్దింది. అదే ఆమె ఆఖరి చూపు. ఆముఖంలో చిరునవ్వు అలాగేవుంది. అక్కడేఉన్న గడియారం "టంగ్,టంగ్" మని పదికొట్టింది.

* * *

మూర్తి ఆత్మహత్య చేసుకోలేదు. కనీసం విచారంతో క్రుంగి పోతున్నట్లుకూడా కనిపించలేదు. అతను ఒకళ్ళ సానుభూతి కోసం ప్రాకులాడలేదు. ఆమెనుగూర్చిన ప్రసక్తికూడా తేవటం లేదు. అతను ఆపీసుపని మామూలుగానే చేసుకొంటున్నాడు.

పదేళ్ళుగడిచాయి. అతనివిచారం మానిందా అనే సంగతే ఎవరికీ అక్కరలేకపోయింది. కొందరు, "ఏమిటో! ప్రేమప్రేమ అంటారు, అది మహా అయితే రెండురోజులు బాధిస్తుంది." అనుకుంటూండేవారు.

కాని అతని కళ్ళల్లో లోతుగా చొచ్చుకున్న విచారం నాకుమాత్రమే కనిపించిందో యింకెవరికన్నా కనిపించిందో తెలియదు.

మొన్న మేమిద్దరం ఏదో బాతాఖాని వేసుకొంటున్నాం. మూర్తి హఠాత్తుగా ఆగి, "నేనామెకి ఒకప్రతిజ్ఞచేశాను. ఆమె మరణించాక నేను బ్రతకన." అన్నాడు.

నేను దాన్ని అట్టే ముఖ్యంగాతలచలేదు జవాబు చెప్పనూలేదు

నిన్నయధాప్రకారం బస్‌స్టాండ్ దగ్గిర నిలుచునాం అతని కేంతట్టిందో, హఠాత్తుగా రోడ్డు మధ్య నడవసాగాడు. అతని ముఖంలో దాగివున్న విచారం మాయమై ఒకగొప్ప ఆనందం అవతరించి ఉన్నట్లనిపించింది నేను మంత్రించబడ్డట్లు అతని కళ్ళకేసే చూస్తూ ఉండి పోయాను.

ఇంతలో ఒకపెద్ద చప్పుడు ,నాతప్పుడు తెలివివచ్చింది. అతనుసరిగ్గా 'ఆమె" లాగే కారుని గుద్దేశాడు. అతని ముఖాన అదే చిరునవ్వు!

దగ్గర్లోనే ఉన్న గడియారం ఏడుస్తూ "టంగ్ టంగ్" మని పదికొట్టింది.